క్లుప్తంగా

పరశురామ బ్రాహ్మణసేవా సంఘం లోగో ఆవిష్కరణ

నరసరావుపేట: పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం లోగోను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సూచనలతో ఈ సేవాసంఘాన్ని ఏర్పాటుచేశారు. దీనిలో అర్చకులు, పురోహితులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, ఆడిటర్లు, న్యాయవాదులు, యువకులు, మహిళలు అందరినీ భాగస్వామ్యం చేశారు. బ్రాహ్మణ అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా అందాల్సిన అభివృది ఫలాలు అర్హులైనవారికి అందించే ఉద్దేశంతో ఈ సేవా సంఘాన్ని ఏర్పాటు చేయటమైందని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా గూడూరు శేఖర్, అధ్యక్షులుగా పాలపర్తి సుధీర్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా తంగిరాల ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులుగా కె.దిలీప్ కుమార్ శర్మ, కోట సుబ్రమణ్య శర్మ, గౌరవ సలహాదారులుగా రంగవఝల కృష్ణకిరణ్‌శర్మ, కొండకావూరు వెంకటరామయ్యలను ఎన్నుకున్నారు. పట్టణంలోని బ్రాహ్మణ పెద్దలు అందరూ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బాలల ప్రగతి



నాదెండ్ల: సంపూర్ణ పౌష్టికాహారం బాలల ప్రగతికి పునాది అని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. యడ్లపాడు పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి ఈ నెల 30 వరకూ దేశవ్యాప్తంగా మాసోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సీడీపీవో శాంతకుమారి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కృష్ణకుమారి



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఎంపీడీవోగా టీవీ కృష్ణకుమారి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పనిచేసిన నాగిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం రిలీవ్ అయ్యారు. ఆయన ఫిరంగిపురం మండలం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్, జూనియర్ అసిస్టెంట్ సూరిబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సాధారణ బదిలీల్లో భాగంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పలు మండలాలకు బదిలీలు అయ్యారు. కార్యాలయ ఏవో శ్రీనివాసరావు నకరికల్లుకు, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ ముప్పాళ్లకు, జూనియర్ అసిస్టెంట్ దాసు సత్తెనపల్లికు బదిలీ అయ్యారు.

ఎస్సీ వర్గీకరణతో అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్



చిలకలూరిపేట: ఎస్సీ వర్గీకరణ చేయడం, క్రిమిలేయర్ అంశం అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ విమర్శించారు. మాలమహానాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ హాలులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై వచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ ఎస్సీలకు ఉన్న రిజర్వేషన్లను విభజించాలని చూస్తున్న రాజకీయ పార్టీలు, సంబంధిత వర్గాల హక్కులకు భంగం కలుగుతున్నప్పు డు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించా రు. సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యడ్ల సురేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు గోదా బాల జాన్‌ముత్తయ్య, కొప్పుల బాబురావు, కులకటి ఏసోబు, గోగులమూడి నాగార్జున, బత్తుల విక్రమ్, యడ్ల పురుషోత్తం, కుల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



వరిపంట పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖల సారథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన అనంతరం గ్రామసభ ద్వారా రైతుల సమస్యలను నివృత్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి వరిపంట ఆశాజనకంగా ఉందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం నూతనంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రతి వారంలో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ముందుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఉదయాన్నే రైతుల సమక్షంలో వ్యవసాయ అధికారుల పంట పొలాలను పరిశీలించి తదుపరి గ్రామసభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి రసూల్, సంపత్, రైతు సేవా కేంద్రం వీఏఏలు పాల్గొన్నారు.

వరి సాగులో కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించండి

రొంపిచర్ల: వరి పొలంలో కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త వెంకటరాములు అన్నారు. మండలంలోని నల్లగార్లపాడు, విప్పర్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామాల్లోని రైతులు సాగుచేస్తున్న వరి పొలాలను సందర్శించి మాట్లాడారు. వరి పొలంలో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు.వరిలో ప్రధాన పొలంలో ఐదు, పది రోజులు దాటిన తర్వాత కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

కాంప్లెక్స్ ఎరువుల మోతాదును తగ్గించి సూటి ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. మరో శాస్త్రవేత్త రజిని మాట్లాడుతూ మిర్చి పంటలో నత్రజని ఎరువులు మూడు విడతలుగా వినియోగించుకోవాలన్నారు. డీడీఏ శివకుమారి మాట్లాడుతూ వరిలో చేడపీడల యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి శివలలిత, పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, వీఏఏలు రాజశేఖర్, వేమారెడ్డి, వెంకటేష్, రైతులు ఇమ్మడిశెట్టి కాశయ్య, వెంకటరెడ్డి, యలమందారెడ్డి, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి తదితర వరి సాగుచేస్తున్న రైతులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు చేసుకోండి

చిలకలూరిపేట: రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. మండలంలోని బొప్పూడి, తాతపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందతర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. వివిధ పంటల యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. ప్రతి మంగళ, బుధ వారాలలో రోజుకు రెండు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వెటర్నరీ డాక్టర్ దీప్తి పశుసంవర్ధక శాఖ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో జీపీ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు,మత్స్యశాఖ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు మండలాల్లో....

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల, ఎండుగుంపాలెం గ్రామాల్లో మంగళవారం అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఏవో హరిప్రసాద్, సర్పంచ్ పి.కోటేశ్వరరావు, కార్యదర్శి ప్రశాంతి పాల్గొన్నారు. పత్తి, మిర్చి పంటపొలాలను పరిశీలించి పత్తిలో గులాబీరంగు పురుగు ఉనికి ఉన్నందున నివారణ చర్యల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ నమోదు, కౌలురైతు గుర్తింపు కార్డులు, పీఎం కిసాన్, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తదితర అంశాలపై ఏవో వివరించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు మండలంలోని కోట, కొత్తపాలెం గ్రామాల్లో బుధవారం అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పత్తిలో గులాబీరంగు పురుగు ఉందని, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సరిత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణపై ప్రభుత్వం దృష్టి

రొంపిచర్ల:వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక విస్తరణ కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని విప్పర్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడారు.

వ్యవసాయ శాఖ ప్రచురించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు జల్లిపల్లి శేషమ్మ, మాజీ సర్పంచ్ ఇమ్మడిశెట్టి కాశయ్య, రామిశెట్టి కోటయ్య, శాస్త్రవేత్తలు ఎం. వెంకటరాములు, రజిని, డీడీఏ శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, పశువైద్య అధికారి డాక్టర్ శ్రీకాంత్, వీఏఏలు వేమారెడ్డి, రాజశేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో..

నరసరావుపేట రూరల్: పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులు దృష్టిసారించాలని లాం శాస్త్రవేత్త డయానా తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల బృందం గులాభిరంగు పురుగు తెల్లదోమ, పచ్చదోమ ఉధృతిని గుర్తించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ సైంటిస్ట్ ఎం.వెంకటరాములు, డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఉద్యాన అధికారి నవీన్, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, టీడీపీ నాయకులు నల్ల పాటిరాము, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జొన్నలగడ్డలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు



విప్పర్ల గ్రామంలో వరి పైరు పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎంఏవో శ్రీలత, వ్యవసాయ సిబ్బంది



నాదెండ్లలో పత్తి పొలం పరిశీలిస్తున్న అధికారులు



కోట గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో సరిత

నేడు నాదెండ్లకు జేసీ రాక

నాదెండ్ల: జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనేరే బుధవారం నాదెండ్లలో పర్యటించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. ఎన్‌హెచ్ 167 రహదారికి నకరికల్లు నుంచి చీరాల వాడరేవు వరకూ విస్తరణ పనులపై భూముల సేకరణ విషయమై రైతులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. కనపర్రు, ఇర్లపాడు, గణపవరం గ్రామాలకు చెందిన రైతులకు చెందిన 4.20 ఎకరాల భూమి రహదారికి కోల్పోతున్నందున వారితో మాట్లాడనున్నట్లు తెలిపారు.

యల్లమందలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు



నరసరావుపేట రూరల్: ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని యల్లమంద గ్రామంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో గ్రామంలోని వ్యర్థాలను సేకరించి పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని వలంటీర్లు సందర్శించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఆరోగ్య సేవా కేంద్రాన్ని సందర్శించి కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ కాకాని నాగలక్ష్మి అడిగి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

క్రోసూరు: స్థానిక కేజీబీవీ పాఠశాలను మంగళవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. వర్షాకాలం ఆవరణలో పాముల బెడద ఎక్కువగా ఉన్నట్లు పాఠశాల ప్రిన్స్‌పల్ ఇందిరా ప్రియదర్శిని చెప్పినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

జొన్నలగడ్డ సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి

దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు వినతి



టీడీపీ కార్యాలయం వద్ద పోస్టర్లు ప్రదర్శిస్తున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: రీ–సర్వే, ఎల్పీ నెంబర్లను దుర్వినియోగం చేసిన సర్వేయర్ రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ రీ–సర్వే ఎల్పీ నెంబర్లు రద్దు చేయడం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రీ సర్వే, ఎల్ పీ నెంబర్లు వలన రైతులకి రెవెన్యూ అధికారులు అన్యాయం చేశారని, ఒకరి భూములు మరొకరికి ఎక్కించారని అన్నారు. ఈ వ్యవహారంలో జొన్నలగడ్డ సర్వేయరు రామాంజనేయులు అక్రమాలకు పాల్పడ్డాడని, అతనిపై చర్య తీసుకోవాలని కోరారు. పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, షేక్.మస్తాన్‌వలి, జి.రామకృష్ణలు బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకాలు లబ్ధిదారుల చెంతకు చేరాలి

కలెక్టరు పి.అరుణ్‌బాబు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, కలెక్టరు

శావల్యాపురం: అర్హత కల్గియున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తించేలా అధికారులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో మన మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక ప్రగతి కోసం ప్రభుత్వం తక్కువ వడ్డీరేటుకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తామన్నారు. అనంతరం ఏస్‌బీఐ బ్యాంకు వారి సౌజన్యంతో 160 మంది మహిళా సభ్యులకు రుణాలను చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర్పేడి రత్నగిరి, జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, ఆర్డీవో సరోజని, మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, గుంటూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీలను సద్వినియోగం చేసుకోండి



వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో చెకుముకి 2024 విద్యా సంవత్సరం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సైన్స్ సంబరాల్లో భాగంగా 8,9,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ నెల 25న మండల స్థాయిలో అక్టోబరు 1వ తేదీన, జిల్లాస్థాయిలో అక్టోబరు 27న రాష్ట్రస్థాయిలో నవంబరు 9,10 తేదీల్లో చెకుముకి సైన్సు ప్రతిభ పరీక్షలు జరుగుతాయన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు వ్యక్తిగతంగా పాల్గొంటారన్నారు. ప్రతి తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ముగ్గురినీ కలిపి సదరు పాఠశాల తరుపున ఒక టీంగా మండలస్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనపర్చిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సభ్యులు బోయపాటి తివిక్రమ్, మోహన్‌చందు, వసంతరావు, సురేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవాదృక్పథం అలవరుచుకోండి



స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని హితవు పలికారు. ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే ఆర్యోక్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం కళాశాల పరిశుభ్రతలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.సరళాదేవి, టి.వి.శంకర రెడ్డి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, ఆంగ్ల శాఖాధిపతి డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్ పాల్గొన్నారు.

వినుకొండలో..



అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని చాట్రగడ్డపాడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన నీటి కాలుష్యం, సముద్రాలకు, జంతువులకు, మానవులకు వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుందని, అందువలన ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ కవర్లు, స్ట్రాలు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిల్స్ వాడటం తగ్గించాలన్నారు. వాటికి బదులు క్లాత్ సంచులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, గ్రామప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన



ఎన్‌టీఆర్ వైద్యసేవ సేవలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ వైద్య సేవ రోగుల వార్డులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జనరల్, గైనకాలజీ వార్డుల్లోని రోగులను వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ హాస్పిటల్, ప్రభుత్వ వైద్యశాల నందు ఉచితంగా టెస్టులు, మందులు, భోజనం ఇవ్వడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ మొదలైన వాటికి పథకం కింద ఉచితంగా పరీక్షలు, మందులు, భోజనం, ప్రయాణ చార్జీలు ఇస్తారని, వైద్యసేవకు నమోదైన హాస్పిటల్ ఓపీ, పరీక్షలకు ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ రజాక్, వైద్య మిత్ర మాచర్ల బుజ్జి, టీం లీడర్ ప్రశాంతి, రత్నం, ప్రశాంత్, డీఈవో సాగర్, హాస్పటల్ సిబ్బంది ఉన్నారు.

జిల్లా జట్టుకు పలువురు విద్యార్థులు

అభినందించిన ఉపాధ్యాయులు



నాగులవరంలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



చెస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జడ్పీహెచ్ఎస్ నాగులవరం విద్యార్థులను పాఠశాలలో ఆవరణలో పాఠశాల హెచ్ఎం షణ్మోహనరావు, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, పీడీ అంకారావులు అభినందించారు. అండర్–17 విభాగంలో బాయ్స్ కబడ్డీలో నలుగు, అండర్–14 విభాగంలో ఇద్దరు, అండర్–14 వాలీబాల్‌లో నలుగురు బాలకలు, అండర్–17 విభాగంలో ముగ్గురు విద్యార్థులు జిల్లాకు సెలెక్ట్ అయినట్లు తెలిపారు.

ఎస్‌వీఎస్‌సీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

పట్టణంలో జరిగిన నియోజవకర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో నూజెండ్ల మండలం సీతారామపురం గ్రామంలోని ఎస్‌వీఎస్‌సీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్–17 కబడ్డీ బాలికలు గోపిశెట్టి లక్ష్మీ ప్రసన్న, దూపాటి శ్రావణి, అండర్–14లో గుమ్మ లోకేశ్వరి, అండర్ –14 బాయ్స్‌లో బొడ్డపాటి ప్రవీణ్‌కుమార్‌లు జిల్లాస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం శిష్టా కామేశ్వరరావు శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.



సీతారామపురంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



యోగ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

స్కూల్ గేమ్స్ నియోజకవర్గ జట్ల ఎంపిక

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో యోగ, చెస్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేశారు. పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ పర్యవేక్షించారు. పోటీలను పాఠశాల హెచ్ఎం కొల్లి పద్మజ, సర్పంచ్ కామినేని లలిత ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ సురేష్ బాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్, పొదిలి వెంకటేశ్వర్లు, ఫిలిప్‌రాజు, ఏఎంజీ రాజు, మున్నంగి సుబ్బారావు, షేక్ ఖాశింబుడే ఉన్నారు.

విరాళం

పెదకూరపాడు: కాకతీయ విద్యా సంస్థ లు విద్యార్థులు మంగళవారం వరద బాధితుల సహాయార్థం రూ.6 లక్షల నగదు చెక్కులు ముఖ్యమంత్రికి అందజేశారు. విద్యార్థులు సేకరించిన, ఉపాధ్యాయులు, యాజమాన్యం అందించిన రూ.5 లక్షలు, 'అన్నా క్యాంటీన్'కి తమ సంస్థ నుంచి మరో రూ.లక్ష కలిపి విరాళమిచ్చినట్లు శీలంనేని సాంబశివరావు తెలిపారు.